సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం ‌। 4 । ఆగస్టు । 2023



పాడి రైతుల సేవలో..

పశు వైద్యం ఇంటి ముంగిటే లభిస్తోంది. టీకాలు కూడా సకాలంలో వేస్తున్నారు.

- 8లో



ఏటీఎం సెంటర్‌లో మోసం

ఏటీఎం సెంటర్‌లో ఓ వ్యక్తి మోసపోయాడు. రూ.50వేలు పోగొట్టుకున్నాడు.

- 8లో

ప్లానింగ్, ఫైనాన్స్ మంత్రి రాక నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ పనులను పరిశీలించేందుకు రాష్ట్ర ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ మంత్రి బి.రాజేంద్రనాథ్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఆయన మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి కలెక్టరేట్ పనులను పరిశీలించి వెంటనే తిరిగి వెళ్తారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

కోటబొమ్మాళిలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు

టెక్కలి రూరల్: జిల్లాస్థాయి చదరంగం పోటీలను ఈ నెల 6వ తేదీన కోటబొమ్మాళి మండల కేంద్రంలోని ఎంజేపీఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 1.1.2012 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగా రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి తమ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని జిల్లా చెస్ అసోసియేషన్ చీఫ్ కోచ్ బగ్గు అభినవ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎపిచెస్.ఒఆర్‌జి వెబ్ సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7416864642 నంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

అబద్ధాలతో ప్రతిపక్షాల కుయుక్తులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అధికారం కోసం విపక్షాలు అబద్ధాలతో కుయుక్తులు పన్నుతున్నాయని, వీరి డ్రామాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టీడీపీ పాలనకు, వైఎస్ జగన్ పాలనకు తేడాను ప్రజలే చూస్తున్నారని అన్నారు. ఆయన నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పేరుతో ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు జగన్ వైపే ఉన్నారని అర్థమైందన్నారు. రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు తాను ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని అన్నారు. మీరు ఎంపీగా పోటీ చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు వైఎస్ జగన్ 'దాసన్నా.. నువ్వు ఎంపీకి పోటీ చెయ్' అని ఆదేశిస్తే పోటీకి సిద్ధమని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా చంద్రబాబు ఇప్పుడు ప్రాజెక్టులు సందర్శించడం ఏంటని అన్నారు. తమ పార్టీలో క్రమశిక్షణ ముఖ్యమని, ఎవరైనా క్రమశిక్షణ అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. చిన్న చిన్న గొడవలు ఎన్నికల సమయానికి సద్దుమణుగుతాయన్నారు. సమావేశంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, జలుమూరు వైస్ ఎంపీపీ తంగి మురళి, సారవకోట జేసీఎస్ కన్వీనర్ తులసీదాస్ పాల్గొన్నారు.


ట్రాన్స్‌జెండర్‌కు రేషన్ కార్డు మంజూరు



రేషన్ కార్డుని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని రెల్లివీధికి చెందిన గురుమూర్తి అలియాస్ రేణుక అనే ట్రాన్స్‌జెండర్‌కు జెండర్ మార్చి రేషన్ కార్డును అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం కార్డును అందజేశారు. ఇంతకుముందు ఆ రేషన్ కార్డులో జెండర్ పురుషుడు అని ఉండేది. దాన్ని ట్రాన్స్‌జెండర్‌గా మార్చాలని రేణుక సచివాలయ సిబ్బందిని కోరారు. సాంకేతిక కారణాల వల్ల చాలా రోజులుగా వీలు పడలేదు. దీంతో ఆమె జిల్లా న్యాయసేవాధికా సంస్థను 2022 అక్టోబర్‌లో ఆశ్రయించారు. దరఖాస్తు పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆ సచివాలయ సిబ్బందికి నోటీసులు పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తమపైవారితో సంప్రదింపులు చేసి ఎట్టకేలకు కార్డులోని జెండర్‌ను పురుషుడి నుంచి ట్రాన్స్‌జెండర్‌గా మార్చి గురువారం ఆమెకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యాధికారిణి మృతి



భవ్యశ్రీ (ఫైల్)

సోంపేట: మండలంలోని బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ భవ్యశ్రీ రహదారి ప్రమాదంలో గురువారం సాయంత్రం విశాఖలో మృతి చెందారు. బట్టిగళ్లూరు వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భవ్యశ్రీ గురువారం విశాఖపట్నంలో షీలానగర్‌లో జరిగిన డిపార్ట్‌మెంట్ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాశాక గాజువాకలో బంధువుల దగ్గరకు స్కూటీపై బయల్దేరారు. అయితే లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈవిడ స్వగ్రామం యానాం. భవ్యశ్రీ మృతి చెందడంతో జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సంతాపం తెలిపారు.

చిటికేసినంత సులువుగా ‣ సమస్యలకు చెక్


ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలు రోజుల్లో పరిష్కారమైపోయాయి. ఇక కావులే అనుకున్న పనులు చిటికెలో జరిగిపోయాయి. మన వల్ల అవ్వదులే అని వదులుకున్న కార్యాలు సైతం క్షణాల మీద పూర్తయ్యాయి. పౌర సేవ ఎంత సులువుగా చేయవచ్చో నిరూపిస్తూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత సమర్థంగా నిర్వహించింది. జిల్లాలో మాసానికి పైగా జరిగిన కార్యక్రమాల్లో 3.27 లక్షల ధ్రువీకరణ పత్రాలను పౌరులకు ఉచితంగా అందజేశారు. వేలాది సమస్యలను సులభంగా పరిష్కరించారు.



రెండున్నర గంటల్లో మంజూరైన రేషన్‌కార్డును మంత్రి సీదిరి చేతులమీదుగా అందుకుంటున్న లబ్ధిదారు ప్రభావతి (ఫైల్)

జగనన్న సురక్ష సూపర్ సక్సెస్

- ఏళ్లుగా వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం
- 3.27 లక్షల ధ్రువీకరణ పత్రాల అందజేత



కాశీబుగ్గ: కలెక్టర్ల నుంచి సచివాలయ ఉద్యోగుల వరకు, మంత్రుల నుంచి వలంటీర్ల వరకు అంతా కలిసి కట్టుగా పనిచేసి జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పథకాలు అందని వారిని గుర్తించడం, సంక్షేమం అందరికీ అందించడమే లక్ష్యంగా జూన్ 23న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మండలం, మున్సిపాలిటీల్లో అధికారులు రెండు బృందాలుగా విడిపోయి జూలై 31 వరకు కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో రికార్డు స్థాయిలో జిల్లాలో మూడు లక్షల ఇరవై ఏడు వేలు మందికి పైగా వివిధ పత్రాలను అందించి రికార్డు సృష్టించారు.

ఏమేమి పొందారు..?

ఈ కార్యక్రమంలో 11 రకాల సర్వీసులు ఉచితంగా అందించారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నిర్దేశించిన ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు, కౌలురైతు ధ్రువీకరణ, బియ్యం కార్డు, బియ్యం కార్డులో చేరికలు, తొలగింపులు, కొత్తకార్డులు, పింఛన్ల నమోదుతో పాటు ఇతర సమస్యలకు పరిష్కారం లభించింది. నిరుపేద కుటుంబాలకు పైసా ఖర్చు లేకుండా పత్రాలు అందజేశారు.

- జిల్లా వ్యాప్తంగా 34 మండలాలు, నగరపాలక సంస్థ, మూడు మున్సిపాలిటీల పరిధిలో 732 సచివాలయాల పరిధిలో 7,33,037 కుటుంబాల నుంచి 3,27,343 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- మొత్తం 12,503 మంది వలంటీర్లు జగనన్న సురక్ష శిబిరాల కోసం తమ క్లస్టర్లలోని 6,75,707 ఇళ్లలో సర్వే నిర్వహించారు.
- ఇందులో రెవెన్యూ 3,04,023, ఆధార్ కార్డుల కరెక్షన్ 19,705, పౌర సరఫరాలు 2,392, గ్రామ వార్డు సచివాలయాలు 527, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ 314, వ్యవసాయశాఖ 162, రిజిస్ట్రేషన్, స్టాంపులు 116, గ్రామీణాభివృద్ధి 70, పురపాలక పరిపాలన 19, కార్మిక శాఖ 6, ఏపీడీసీఎల్ 5, పోలీసు శాఖకు సంబంధించి నాలుగు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఫేక్ పత్రాలు పెట్టడంతో 10,903 మంది అర్హత పొందలేదు.
- దరఖాస్తు చేసుకున్నవారిలో తక్షణ సహాయంగా 95 శాతం మంది లబ్ధి పొందడం ఆనందించదగ్గ విషయం.

క్షణాల్లో పరిష్కారం



- కేవలం దరఖాస్తు చేసుకున్న రెండున్నర గంటల్లో కొత్త రేషన్ కార్డు అందించిన సంఘటన పలాస మండలం చినంచల గ్రామంలో జూలై 19వ తేదీన జరిగింది. గ్రామానికి చెందిన పినకాన ప్రభావతి దంపతులు ఉపాధి కోసం ఢిల్లీ వెళ్లారు. గ్రామంలో సురక్ష కార్యక్రమం జరిగే నాటికి వారు ఊరిలోనే ఉన్నారు. దీంతో రేషన్ కార్డు కోసం ఉదయం దరఖాస్తు చేసుకున్నారు. ఆ రోజు మంత్రి సీదిరి అప్పలరాజు రావడంతో మధ్యాహ్నం ఆయన చేతులమీదుగానే కొత్త రేషన్ కార్డును వారికి అందజేశారు. ఎంపీడీఓ రమేష్‌నాయుడు దరఖాస్తు చేసుకున్న రెండున్నర గంటల్లో సచివాలయం నుంచి ఎమినిటీ, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు దాటుకుని మండల సివిల్ సప్లైకు చేరిందని, అక్కడ డీటీ నుంచి తిరిగి నంబర్ క్రియేట్ అయ్యి రశీదు రూపంలో అందించామని వివరించారు. దీంతో అంతా వారిని అభినందించారు.



- పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ పరిధిలోని రంగోయి గ్రామంలో గేదెల తారకేశ్వరరావు అనే పేరు గల ఇద్దరు వ్యక్తుల్లో రెండేళ్లుగా ఒకరి పింఛన్ మరొకరు పొందుతున్నారు. సురక్షలో కనిపెట్టిన అధికారులు దీన్ని వేరుచేసి అసలైన గేదెల తారకేశ్వరరావుకు పింఛన్ మంజూరు చేశారు.



- పలాస మండలం టెక్కలిపట్నం మేజరు పంచాయతీ పరిధిలోని సవర పార్వతి భర్త మరణించి చాలా ఏళ్లవుతోంది. ఉమ్మడి కుటుంబంలో పేరు ఉండడంతో పింఛన్ దొరకలేదు. సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ పాలిన కృష్ణారావు నేతృత్వంలో అధికారులకు విన్నవించగా రేషన్‌కార్డులో పేరును తొలగించి నూతన కార్డు మంజూరు చేశారు. ఇప్పుడు ఆమెకు ఫించన్ సైతం అందనుంది.
- పలాస మండలం అమలకుడియా పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి ఓ రైతు కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం అని తప్పుగా ఎంటర్ కావడంతో పథకాలు అందడం లేదు. సురక్ష కార్యక్రమంలో తప్పు సరి చేయడంతో అన్ని పథకాలకు అర్హులయ్యారు.
- పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో మహాలక్ష్మి అనే మహిళకు రేషన్ కార్డులో పొరపాటున 'మేల్' అని వచ్చేయడంతో వితంతు పింఛన్‌కు దూరమయ్యారు. సురక్షలో అధికారులు ఆ సమస్యను పరిష్కరించేశారు.



- పలాస మండలం బ్రాహ్మణతర్లా మార్కెట్‌లో రెండు కాళ్లు లేని దూపాన రవికుమార్‌కు అధికారులంతా దగ్గరుండి ఆధార్,రేషన్ కార్డు అందజేశారు.

సంక్షేమం.. సురక్షితం..



జగనన్న సురక్ష పేదలకు ఎంతో మేలు చేసింది. ఇక్కడ పరిష్కారం కానటువంటి 20కు పైగా లబ్ధిదారులను గుర్తించి విజయవాడ ప్రధాన కార్యాలయానికి దరఖాస్తులు పంపించాం. కార్డుల్లో పొరపాట్ల కారణంగా చాలా వివాదాలు తలెత్తాయి. అవన్నీ పరిష్కృతమయ్యాయి. కొన్ని వారాల్లో సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి.

– ఎస్.రమేష్‌నాయుడు, సురక్ష కార్యక్రమం టీం హెడ్, ఎంపీడీఓ, పలాస మండలం

సైరిగాంలో జ్వరాల సైరన్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీతులసి

జలుమూరు: సైరిగాం గ్రామంలో జ్వరాల సైరన్ మోగింది. ఇటీవల గ్రామంలో దాదాపు 400 మంది జ్వరాల బారిన పడ్డారు. అయితే వీరికి కనీసం పరీక్షలు జరపకుండా మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు అంటూ నిర్ధారణ చేసి స్థానిక ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు మందులు వాడించారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తానని డిప్యూటీ డీఎంహెచ్ఓ డి.లక్ష్మీతులసి అన్నారు. గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయని కలెక్టర్ సూచించడంతో గురువారం అక్కడ మెడికల్ క్యాంప్ నిర్వహించి ఆమె సిబ్బందితో మాట్లాడారు. స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నప్పటికీ గ్రామస్తులు స్థానిక సంచి డాక్టర్లను ఆశ్రయించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డెంగీ అంటూ ప్రాణాంతకమైన స్టెరాయిడ్లు వాడుతున్నారని వివరించారు. ఇవి తాత్కాలిక ఉపశమనం కలిగించినా రోగి తర్వాత శక్తిని కోల్పోతాడని హెచ్చరించారు. అసలు డెంగీ జ్వరం నిర్ధారణకు జిల్లా కేంద్రంలోనే పరీక్షలు జరిపించాలన్నారు. ఈ నిబంధనలు పాటించకుండా ఐదారుగురు సంచి వైద్యులు వేలాది రూపాయల మందులు కొనిపించారని



అన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో ఫీవర్, లార్వా సర్వే చేయాలన్నారు. వైద్య శిబిరంలో జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, అచ్యుతాపురం, జలుమూరు,సైరిగాం మెడికల్ అధికారులు కొయ్యాన అప్పారావు, తాడేల శ్రీకాంత్, పి.గురునాథరావు డివిజనల్ అధికారి వైకే శ్రీనివాసరావు, విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు తోపాటు సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పి.ముసలినాయుడు, ధర్మాన రమణమూర్తిలు ఉన్నారు.

ఓటర్ల జాబితా సవరిస్తున్నాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ వేగంగా జరుగుతోందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. విశాఖపట్నంలో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై కలెక్టర్లతో రెండో రోజు సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జిల్లా ఓటర్ల సవరణ కార్యక్రమంపై మాట్లాడారు.

డయల్ యువర్ యూనివర్సిటీ రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 5వ తేదీన డయల్ యువర్ విశ్వవిద్యాలయం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 8247861919 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

సిక్కోలు తీరంలో ‣ అక్కినేని అందగాడు



మీడియాతో మాట్లాడుతున్న నాగచైతన్య

ఎచ్చెర్ల క్యాంపస్: త్వరలో తాను నటించనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా స్టార్‌హీరో అక్కినేని నాగచైతన్య సిక్కోలు తీరాల్లో గురువారం పర్యటించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రచయిత కార్తీక్ మత్స్యకారుల ఇతివృత్తంతో రాసిన కథతో ఈ చిత్రం తెరకెక్కనుండడంతో ఆ చిత్ర యూనిట్ ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీ, కె.మత్స్యలేశం గ్రామాన్ని సందర్శించింది. ఈ సినిమాకు చందు మొండేటి దర్శకుడు కాగా, గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చిత్రం నిర్మిస్తున్నారు. దీంతో హీరో, దర్శకుడితో పాటు సహ నిర్మాత బన్నీ వాసు గ్రామంలో కలియతిరిగారు. కె.మత్స్యలేశంకు చెందిన గనగళ్ల రామారావు వలస మత్స్యకారునిగా గుజరాత్ వీరావల్ వెళ్లి సముద్రంలో వేట సమయంలో పాకిస్థాన్ కోస్టు గార్డులకు చిక్కాడు. అప్పటికి ఆయన భార్య రెండు నెలల గర్భవతి, ఆయన మళ్లీ విడుదలైన నాటికి కుమార్తె ఉంది. ఈ సున్నిత ఇతివృత్తాన్ని కథాంశంగా తీసుకుని మానవీయ కోణంలో ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలిసింది. సహజత్వం కోసం ఇక్కడ కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తామని వారు తెలిపారు. ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మిలు పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. నాగచైతన్యను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో గ్రామానికి వచ్చారు.

'సీఎం వైఎస్ జగన్ పాలన చరిత్రాత్మకం'



రైతులకు భూహక్కు రీసర్వే పత్రాలు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్ పాలన చరిత్రాత్మకంగా నిలుస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలోని సూర్యానారాయణపురం(పుల్లాజీపేట) గ్రామంలో సమగ్ర భూసర్వే పత్రాలను గురువారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నిజమైన రైతుకు సంబంధించిన భూమిని పక్కాగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ విధానం ద్వారా నకిలీలకు చెక్ పెట్టడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కేవీజీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, ఈఓపీఆర్డీ ఆనందరావు, వీఆర్వో తిరుపతిరావు, పంచాయితీ కార్యదర్శి పోతురాజు లక్ష్మి పాల్గొన్నారు.

అచ్చెన్నా.. ఇప్పుడు గుర్తుకువచ్చామా..?



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడుతున్న మూలపేట పోర్టు నిర్వాసితులు

- అచ్చెన్నాయుడు వైఖరిపై మూలపేట వాసుల ఆగ్రహం
- ఎన్నికల సమయాల్లోనే మూలపేటపై మమకారం వస్తుందని మండిపాటు
- పోర్టును అడ్డు పెట్టుకుని రాజకీయం చేయడం ఆపాలని హితవు



టెక్కలి: ఎన్నికలు దగ్గర పడితేనే టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుకు తమ ఊరు గుర్తుకువస్తుందని మూలపేట ప్రజలు మండిపడ్డారు. మూలపేట పోర్టు విషయంలో టీడీపీ కార్యకర్తలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాలని చూడవద్దని హితవు పలికారు. రెండు రోజుల కిందట టెక్కలిలో మీడియా సమావేశంలో మూలపేట పోర్టుపై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను గురువారం టెక్కలిలో మూలపేట పోర్టు నిర్వాసితులు తీవ్రంగా ఖండించారు. తమ సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చక్కగా స్పందిస్తున్నారని, ఎమ్మెల్సీ దువ్వాడ తమకు అండగా ఉన్నారని స్పష్టం చేశారు. ఇలాంటి సమయంలో పోర్టు నిర్వాసితులకు అన్యాయం జరిగిపోయిందంటూ అచ్చెన్నాయుడు నాటకాలు ఆడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. మూలపేటలో టీడీపీ కార్యకర్తల ప్రయోజనాల కోసం మిగిలిన వారిని పక్కదారి పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలపై ఇప్పటికే ఎమ్మెల్సీ దువ్వాడ సాయంతో సీఎం దృష్టికి తీసుకువెళ్లామని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ఇకనైనా పోర్టు పేరుతో కపట నాటకాలు మానుకోవాలని నిర్వాసితులు జీరు రాంబాబు, జీరు శివ, డి.అప్పలరెడ్డి, శేఖర్, దాలయ్య, శ్రీను, రాజు, గజేంద్ర తదితరులు పేర్కొన్నారు.

వక్రీకరిస్తున్నారు



పోర్టు నిర్వాసితుల సమస్యలపై కొన్ని మీడియాలు లేని పోనివి వక్రీకరిస్తున్నాయి. ఇటీవల మా సమస్యలను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు వివరిస్తున్నపుడు దానిని వ్యతిరేకంగా ప్రచారం చేశారు. నాలుగున్నరేళ్లుగా కనీసం పట్టించుకోని అచ్చెన్నాయుడుకు సడన్‌గా మూలపేట పై మమకారం పుట్టుకొచ్చింది. పోర్టుపై లేని పోని రాజకీయాలు మానుకోవాలి.

– జీరు రాంబాబు, మూలపేట.

అప్పుడు పట్టించుకోలేదు



ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుకు మూలపేట ప్రజలు ఇప్పుడు గుర్తుకొచ్చారా? పోర్టు భూసేకరణ మొదట్లో ఎన్నో సార్లు గ్రామానికి చెందిన కొంత మంది అచ్చెన్నాయుడుకు చెబితే కనీసం పట్టించుకోలేదు. ఇప్పుడు మా సమస్యలు పరిష్కారమవుతున్న సమయంలో అచ్చెన్నాయుడు కుటిలమైన రాజకీయాలు చేస్తున్నారు.

– జీరు శివ, మూలపేట

రాజకీయం చేయవద్దు



మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలపై అచ్చెన్నాయుడు రాజకీయాలు చేయడం మానుకోవాలి. పోర్టు కోసం అంతా అంగీకారంతో భూములిచ్చాం. మా నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం స్పందిస్తోంది. కొంత మంది టీడీపీ కార్యకర్తల మాటల వింటూ అచ్చెన్నాయుడు అర్థం లేని విమర్శలు చేస్తున్నారు.

– దారపు అప్పలరెడ్డి, మూలపేట

రాద్ధాంతం చేస్తున్నారు



నిర్వాసితుల సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేయాలి. అలా కాకుండా కొంత మంది టీడీపీ కార్యకర్తలు రాద్ధాంతం చేస్తున్నారు. నిర్వాసితులపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది. అంతా ఒక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటే మంచిది. రాజకీయ లబ్ధిని పొందే నాయకుల మాటలు వినవద్దు.

– జీరు శేఖర్, మూలపేట



బరువు.. బాధ్యత

కంచిలి మండలం బూరగాం గ్రామంలోని దేవాంగుల వీధిలో మినీ రక్షిత నీటి పథకాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఇలా నీళ్ల బిందెను మోస్తూ స్థానికులతో కలిసిపోయారు.

- కంచిలి

క్లుప్తంగా

దశల వారీగా ఉద్యమం



విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్న ఉద్యోగులు

అరసవల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోతే దశలవారీ ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 10న నిరవధిక సమ్మెకు దిగుతామని విద్యుత్ శాఖ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముంగిట ఉద్యోగుల రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. 20 మంది ఉద్యోగులు దీక్షలో కూర్చోగా.. వీరికి సంఘీభావంగా జేఏసీ కన్వీనర్ జి.రమేష్, చైర్మన్ ఎం.వి.గోపాలరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కో–కన్వీనర్లు పైడి యోగేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, జి.సురేష్‌కుమార్, శ్యామలరావు, జె. సురేష్‌కుమార్, ఎస్.వెంకటరావు తదితరులు హాజరై నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 4, 5, 6 తేదిల్లో 'వర్క్ టు రూల్' విధానాన్ని ప్రతి విద్యుత్ ఉద్యోగి తప్పనిసరిగా అమలు చేయనున్నారు. ఈక్రమంలో ఈ మూడు రోజులు కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు మాత్రమే ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించనున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చే ఫిర్యాదు పట్టించుకునేదీ లేదని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స పర్యటన

అరసవల్లి: జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమీక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, అధికారులు హాజరుకానున్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

కంచిలి: కంచిలి పోలీస స్టేషన్ పరిధిలో ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎస్. బాలరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పలాసలో సబ్సిడీ టమాటాల విక్రయం



టమాటాలను తూకం వేస్తున్న దృశ్యం

పలాస: పెరుగుతున్న నిత్యావసర ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించడమే ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎ.ఎం.సి. చైర్మన్ పి.వి. సతీష్ చెప్పారు. పలాస వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం సబ్సిడీ ధరలపై టమాటాల విక్రయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో టామాటా ధరలు బాగా పెరిగిపోవడం వల్ల వాటిని నియంత్రించడానికి మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు సంబంధిత అధికారులతో మాట్లాడి 1000 కేజీల టమాటాలు తెప్పించినట్లు తెలిపారు. ఒకరికి కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నట్లు చెప్పారు. 850 కిలోల విక్రయం జరగ్గా, మిగిలిన వాటిని శుక్రవారం విక్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి వాణీప్రసన్న, సూపర్‌వైజరు వైకుంఠరావు, ఆంధ్రయ్య, దుర్యోధన, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ పరీక్షల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహిస్తున్న రెండో సెమిస్టర్ పోస్టు గ్రాడ్యుయేషన్ పరీక్షలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గురువారం పరిశీలించారు. పరీక్షలు జరగుతున్న తీరుపై ఆరా తీశారు. పరీక్షలు సజావుగా నిర్వహించాలని, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

పాడి రైతుల సేవలో..!



తిర్లంగి గ్రామ సచివాలయం వద్ద 1962 వాహనం వద్ద పాడి రైతులు

- ఇంటి ముంగిటకే పశు వైద్యం
- ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు
- గతం కంటే మెరుగైన సేవలు అందుతున్నాయంటున్న పెంపకందారులు

టెక్కలి:

వ్యవసాయంతో పాటు పశు పోషణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా పాడి రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఒకప్పుడు గ్రామాల్లో పశు వైద్యం అందాలంటే గగనంగా ఉండేది. సమీపంలోని గ్రామీణ పశు వైద్యశాలలకు, మండల కేంద్రాల్లోని పశు వైద్య ఆస్పత్రులకు వ్యయ ప్రయాసాలకు ఓర్చి పశువులను తరలించాల్సిన దుస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పాడి రైతుల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయి. గ్రామీణ పశు సంవర్ధక సహాయకులను నియమించి నిరంతరం పశువుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షణ చేసేలా వ్యవస్థను పటిష్టం చేశారు. టెక్కలి పశు సంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, జలుమూరు, సారవకోట తదితర 16 మండలాల పరిధిలో గతం కంటే అదనంగా 140 మంది పశు వైద్య సిబ్బంది గ్రామ స్థాయిలో నిరంతరం పశు వైద్య సేవలు అందజేస్తున్నారు.

జిల్లాలో మెరుగైన సేవలు..

జిల్లావ్యాప్తంగా పశు వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయి. జిల్లా కేంద్రంలో పశు గణాభివృద్ధి కేంద్రం, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం, నియోజకవర్గ స్థాయిలో ఏడు వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, సమగ్ర గొర్రెల అభివృద్ధి కేంద్రం, బహుళార్థక సాధక పశు వైద్యశాల ఒకటి చొప్పున ఉన్నాయి. అలాగే 77 పశు చికిత్సాలయాలు, 15 పశు వైద్య శాలలు, 61 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, 644 రైతు భరోసా కేంద్రాలో పశు వైద్య సేవలు నిరంతరం అందుతున్నాయి. వీటి పరిధిలో సంయుక్త సంచాలకుడు, నలుగురు ఉప సంచాలకులు, 65 మంది పశు వైద్యులు, 18 మంది సహాయ సంచాలకులు ఉన్నారు. వీరితో పాటు ప్రతీ ఆర్‌బీకేలో పశు సంవర్ధక సహాయకులు ఉన్నారు. కొత్తగా ప్రతి నియోజకవర్గంలో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.



పాడి రైతు ఇంటి వద్ద దూడకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

ఇంటి ముంగిటకే..

గతంలో పశువులకు అనారోగ్యం కలిగితే ప్రైవేట్ వాహనాల్లో మండల కేంద్రాల్లోని పశు వైద్య కేంద్రానికి తరలించేవారు. ఇప్పుడు 1962 (డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం) అందుబాటులో ఉంటోంది. గ్రామీణ పశు వైద్య సహాయకులు నిత్యం పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశు వైద్యం చేస్తున్నారు. వీటితో పాటు పశు సంవర్ధక శాఖ ద్వారా వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం, వైఎస్సార బీమా, వ్యాధి నిర్ధారణ నమూనాల సేకరణ, పశువులకు కృత్రిమ గర్భోత్పత్తి, పశు గ్రాస విత్తనాల పంపిణీ, సమీకృత మిశ్రమ దాణా, పశు విజ్ఞాన బడి, పశు గ్రాసాల పెంపకాలు, టెలి మెడిసిన్, పశు చేయూత పథకం, పశు మత్స్యదర్శిని, ప్రతి సీజన్‌లో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ఇటీవల కాలంలో లంపిస్కిన్, బ్రూసెల్లోసిస్ తదితర వ్యాధుల నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన టీకా కార్యక్రమం నిర్వహించారు. పశువులకు వ్యాపించే అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు.

వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు..



ప్రతి నియోజకవర్గానికి వైఎస్సార్ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. గతంలో పశు వ్యాధుల నిర్ధారణకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు నియోజకవర్గాల్లోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

– వి.జయరాజ్, పశుసంవర్ధక శాఖా డీడీ, టెక్కలి

అందుబాటులో సిబ్బంది..



మాకు 4 ఆవులు, 6 గేదెలతో పాటు 5 దూడలు ఉన్నాయి. గతంలో పశువులకు వైద్యం కావాలంటే లింగాలవలస, టెక్కలి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

– ఐ.ఉమాపతి, పాడి రైతు, తిర్లంగి, టెక్కలి మండలం

ఇంటి వద్దనే వైద్యం..



మాకు 14 ఆవులు, 9 దూడలు ఉన్నాయి. 1962 ద్వారా ఇంటి వద్దనే పశువులకు వైద్యం అందజేస్తున్నారు. పశువులకు అవసరమైన మందులు అందజేస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో పశు పోషణ మరింత అభివృద్ధి చెందుతుంది.

– బి.రాంబాబు, పాడి రైతు, తిర్లంగి, టెక్కలి మండలం

అవగాహన కల్పిస్తున్నాం..



నా పరిధిలో పశువుల ఆరోగ్యం పట్ల ప్రతి రోజూ పాడి రైతులతో మాట్లాడుతాం. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ప్రభుత్వం అందజేస్తున్న మందులు, ఇతర సంక్షేమ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– అనిల్‌కుమార్, పశు సంవర్ధక సహాయకుడు, తిర్లంగి పంచాయతీ

సీఎంను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ గొండు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గొండు కృష్ణమూర్తి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): డీసీఎంఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన గొండు కృష్ణమూర్తి సీఎం జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గం పరిశీలకుని బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. డీసీఎంఎస్‌ను మరింత అభివృద్ధిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

మూలపేట పోర్టును అడ్డుకునేందుకు కుట్రలు

- అచ్చెన్నపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జిల్లా అభివృద్ధికి మూలపేట పోర్టు ప్రత్యేకంగా నిలుస్తుందని, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి జరిగి వేలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని, ఇటువంటి పోర్టును ఆపడానికి అచ్చెన్నాయుడు రాజకీయం చేయాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడారు. టెక్కలి ప్రాంతంలో పోర్టు 70 ఏళ్ల నాటి కల అని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలను పావులుగా చేసుకుని అచ్చెన్నాయుడు రాజకీయ లబ్ధిని పొందాలని చూస్తున్నారని దువ్వాడ మండిపడ్డారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో రైతుల అంగీకారం మేరకే భూసర్వే జరిగిందని గుర్తు చేశారు. ముందస్తుగా ప్రకటించిన దానికంటే అదనంగా పరిహారం చెల్లించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. అన్ని రకాల వసతులతో నిర్వాసిత కాలనీ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు కేవలం టీడీపీ కార్యకర్తలు అచ్చెన్నాయుడు డైరెక్షన్‌లో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో పోర్టు నిర్మాణం సాధ్యం కాలేదన్నారు. అప్పట్లో పోర్టు పేరుతో సుమారు 15 వేల ఎకరాలను చంద్రబాబుకు కట్టబెట్టడానికి అచ్చెన్నాయుడు వేసిన ప్లాన్ బెడిసికొట్టిందన్నారు. ప్రస్తుతం పోర్టు పనులు ప్రారంభమయ్యాయని, అన్ని రకాల అడ్డంకులను తొలగించుకుని వచ్చే ఫిబ్రవరి నాటికి షిప్పులు తిరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నారని ఎమ్మెల్సీ తెలిపారు. టెక్కలిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు లేకుండా పక్కగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వర్ణకారుల స్థలం విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈయనతో పాటు సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్‌రెడ్డి ఉన్నారు.

లంపిస్కిన్ నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ముద్ద చర్మపు వ్యాధి (లంపిస్కిన్) వ్యాధి నివారణకు ఈ నెల 30 వరకు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎం.కిషోర్ తెలిపారు. లంకాం గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల వయస్సు ఉన్న తెల్ల పశువులన్నింటికీ టీకాలు వేయించాలని కోరారు. ఈ వ్యాధి బారిన పడితే పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గి రైతులు నష్టపోతారని చెప్పారు. ఈసారి అటువంటి నష్టం రాకుండా పశువులు పెంపకం చేసేవారంతా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగన్నాథం, రాగోలు పశువైద్యాధికారి బి.యోగేశ్వరరావు, డాక్టర్ బి.వి.రాజశేఖర్, సర్పంచ్ చిట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్‌లో మోసం

- ఏటీఎం కార్డు చోరీ కావడంతో రూ.50 వేలు మాయం



శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఓ రిటైర్డు ఉపాధ్యాయుడు ఏటీఎంలో సొమ్మును డ్రా చేస్తుండగా వెనుకన నిల్చున్న ఓ యువకుడు పిన్ నంబర్ చూసి, ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.50,612 అతని ఖాతా నుంచి మాయం చేశాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్ కాలనీకి చెందిన వుదయాన కృష్ణమోహన్ అనే రిటైర్డు ప్రభుత్వోద్యోగి ఈ నెల 2న తన పెన్షన్ డబ్బులు డ్రా చేసేందుకు డేఅండ్‌నైట్ కూడలి సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. ముందుగా రూ.9 వేలు విత్ డ్రా చేశారు. సర్వర్ డిలే కారణంగా గ్రీన్ లైట్ వెలగకపోవడంతో కార్డు రాలేదు. ఈలోగా నోట్లు లెక్కపెట్టే పనిలో నిగ్నమవ్వగా.. వెనుక నిల్చున్న 30 ఏళ్ల యువకుడు చాకచక్యంగా ఉపాధ్యాయుని ఏటీఎం కార్డు దొంగిలించాడు. దాని స్థానంలో ఎస్‌బీఐ ఏటీఎం కార్డు పెట్టేశాడు. ఇది గమనించని ఉపాధ్యాయుడు తన కార్డే అనుకుని మిషన్‌లో ఉన్న యువకుని కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 9:30 దాటిన తర్వాత ఉపాధ్యాయుని నెంబర్‌కు రూ.10 వేలు, రూ.వెయ్యి, రూ.39,612 వేలు డ్రా చేసినట్లు మెసేజులు రావడంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. వెంటనే కుమారుడికి విషయం చెప్పడంతో ఏటీఎం కార్డు బ్లాక్ చేశారు. ఉదయం రూ.9 వేలు డ్రా చేసే సరికి రూ.1,27,000 రిమైనింగ్ బ్యాలెన్సు చూపించిన కార్డు.. రాత్రి అయ్యేసరికి రూ.77,600 చూపించింది. గురువారం ఉదయం సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేయగా అకౌంట్ స్టేట్‌మెంట్‌ను పరిశీలించారు. రూ.10 వేలు, రూ.వెయి ఏటీఎంలో డ్రా చేయగా, రూ.39,612 విశాఖపట్నం ద్వారకా నగర్‌లో బంగారం షాపులో స్వైపింగ్ చేసినట్లు గుర్తించారు. గురువారం రాత్రి రెండో పట్టణ పోలీసులకు ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

క్రైమ్ కార్నర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దరోకలపల్లి సమీప రైల్వే ట్రాక్‌పై పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఏఎస్ఐ నర్సింహులు తెలిపారు. మృతుడి వయసు 55 ఏళ్లు ఉండవచ్చని, హౌరా నుంచి చెన్నై వెళ్తున్న హౌరా మెయిల్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పరిశీలించి కేసునమోదు చేయనున్నట్లు తెలిపారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య



విష్ణు గురునాథ్(ఫైల్)

సారవకోట: మండలంలోని మాళువ గ్రామానికి చెందిన విష్ణు గురునాథ్(48) బుధవారం రాత్రి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణు గురువర్ధన్ గత నెల 31న మద్యం సేవించి ఇంటికెళ్లి భార్య రాధమ్మతో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో ఉన్న గడ్డి మందు తీసుకుని సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లి తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న గురునాథ్‌ను స్థానికులు గుర్తించి 108 అంబులెన్సులో పాతపట్నం సీహెచ్‌కి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం రాత్రి మృతి చెందాడు. భార్య రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని యువకుడు మృతి



యువకుడి మృతదేహం

కంచిలి: మండల కేంద్రం కంచిలి సమీపంలో రైల్వే ట్రాక్‌పై గురువారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతిచెందాడు. పలాస నుంచి కోల్‌కతా వైపు వెళ్లే మార్గంలో ట్రాక్ పక్కన యువకుడి మృతదేహం గాయాలతో పడి ఉంది. సమాచారం అందుకున్న పలాస జీఆర్‌పీ ఎస్ఐ షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి



జాక్సన్ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

కాశీబుగ్గ: పంటపాలంలో ట్రాక్టర్‌తో దమ్ము పట్టి అనంతరం అదే ట్రాక్టర్ కిందపడి యువకుడు మరణించిన విషాద ఘటన గురువారం కంట్రగడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గుసాని బ్లాక్ భీంపురం గ్రామానికి చెందిన సవర్ జాక్సన్(25) పలాస మండలం రెంటికోట పంచాయతీ కంట్రగడ గ్రామంలో పంటపొలాలను ట్రాక్టర్‌తో దమ్ముపట్టేందుకు వచ్చాడు. పని పూర్తయ్యాక పొలం నుంచి రోడ్డుకు ఎక్కించే ప్రయత్నంలో ట్రాక్టర్ బోల్తా పడి నేరుగా గెడ్డలో జారిపడటంతో జాక్సన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికంగా వరినాట్లు వేస్తున్న మహిళలు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ కింద ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రెంటికోట సర్పంచ్ శాశనపురి తిరుమలరావు, నాయకులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని ఆరా తీశారు.

బొలేరో వ్యాన్ చోరీ

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్‌రోడ్డు పక్కన రెడ్డి ఆస్పత్రి సమీపంలో పార్క్ చేసి ఉంచిన బొలేరో పికప్ మినీ వ్యాన్ చోరీకి గురైనట్లు వాహన యజమాని వంకల సోమేశ్వరరావు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వాహన డ్రైవర్ కొటియా కూర్మారావు ఈ స్థలంలో బుధవారం రాత్రి పార్క్ చేసి తన ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. యజమానికి సమాచారం ఇవ్వడంతో, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



అసెంబ్లీ నియోజకవర్గ సమావేశానికి హాజరైన నాయకులు

- నియోజకవర్గాల పరిశీలకులకు వైఎస్సార్ సీపీ అధిష్టానం దిశానిర్దేశం
- మూడు నియోజకవర్గాలకు పరిశీలకుల మార్పు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులకు పార్టీ అధిష్టానం దిశానిర్దేశం చేసింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశానికి విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు హాజరయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు (పాతపట్నం), పాలవలస విక్రాంత్ (గజపతినగరం), కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు (ఎచ్చెర్ల), కేవీ సూర్యనారాయణరాజు (పలాస), మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి (పార్వతీపురం), టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ (ఇచ్ఛాపురం), డోల జగన్ (విజయనగరం), కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు (నెల్లిమర్ల), పేరాడ తిలక్ (రాజాం), డాక్టర్ నిమ్మాన దాస్ (చీపురుపల్లి), కరిమి రాజేశ్వరరావు (బొబ్బిలి), తైనాల విజయ్‌కుమార్ (ఎస్.కోట), తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ (కురుపాం), గొండు కృష్ణమూర్తి (పాలకొండ), శ్రీనివాసరెడ్డి (సాలూరు) తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకూ విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా వ్యవహరించిన లల్లా అగర్వాల్ స్థానంలో డోల జగన్ నియమితులయ్యారు. డోల జగన్ ఇప్పటివరకూ పరిశీలకుడిగా ఉన్న పాలకొండ నియోజకవర్గంలో శ్రీకాకుళం డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి బాధ్యతలు తీసుకున్నారు. మీసాల నీలకంఠం నాయుడు స్థానంలో సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా భీమిలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డిని అధిష్టానం నియమించింది.

విద్యుత్ షాక్‌తో ముగ్గురు దుర్మరణం



పాండ్రంకి కేసరినాయుడు, గంద్రేటి చంద్రశేఖర్, దూబ రెయ్యమ్మ (ఫైల్)

రాజాం/సంతకవిటి: విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సోమన్నపేట గ్రామంలో గురువారం తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పాండ్రంకి కేసరినాయుడు (24), గంద్రేటి చంద్రశేఖర్ (18), దూబ రెయ్యమ్మ (57) విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. పాండ్రంకి రామినాయుడు ఇంటి మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో భాగంగా అతని కుమారుడు కేసరినాయుడు, అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడు గంద్రేటి చంద్రశేఖర్‌ను పనికి పిలిచి డాబా ఎక్కారు. ఆ సమయంలో డాబా మీద ఉన్న 12 ఎంఎం ఇనుప రాడ్‌ను డాబా వెనుక వైపునకు నెట్టగా, డాబాకు కొద్ది దూరంలో ఉన్న 230 ఓల్ట్స్ విద్యుత్ సరఫరా తీగలకు రాడ్ తగిలింది. వెంటనే రాడ్‌ను పట్టుకున్న ఇద్దరు యువకులు షాక్‌కు గురై పెద్దగా కేకలు వేస్తూ మృతి చెందారు. డాబా మీద యువకుల అరుపులను ఎదురుగా ఉన్న అంగన్‌వాడీ ఆయా దూబ రెయ్యమ్మ విని వెంటనే డాబాపైకి వెళ్లి పొరపాటున ఇనుప చువ్వను ముట్టుకోవడంతో ఆమె కూడా షాక్‌కు గురై మృతి చెందింది. ఈ విషయాన్ని గమనిస్తున్న ఒకరిద్దరు ఏదో జరుగుతుందని ఊహించి డాబా ఎక్కకుండా పొలాల్లో ఉన్న కుటుంబీకులకు సమాచారం అందించారు. గ్రామంలోకి వచ్చిన కిరాణా సరుకుల రవాణా వ్యాపారి డోల ప్రసాద్ డాబా వెనుక వైపునకు వెళ్లి ఇనుప రాడ్ స్ట్రీట్ లైన్ విద్యుత్ తీగలకు తగిలి ఉండడాన్ని గమనించి ఎలక్ట్రికల్ ఏఈకి ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. అనంతరం డాబా ఎక్కి చూసి డాబాపై ముగ్గురు పడి ఉండడాన్ని గమనించి డాబా కిందకు దించారు. ముగ్గురిలో చంద్రశేఖర్ కొన ఊపిరితో ఉన్నాడనే అనుమానం రావడంతో వెంటనే ప్రైవేట్ వాహనంలో సంతకవిటి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో తిరిగి గ్రామానికి తీసుకొచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.